# మంత్రాలాట

కోలా బాబూరావు

ఆవేళ ఆఫీస్కి శెలవు, అదేమిటోగాని శెలవు రోజున కొంచెం ప్రొద్దెక్కేవర్కూ పడుకొందామని అనుకోవడమేగాని ఆరోజునే త్వరగా మెళుకువ వచ్చేస్తుంది. యింకా పేపరు రాలే. ఆకిర్తంరోజు పేపరే 'సంపాదకీయం'చదువుతూ కూర్చున్నా.

ఇంతట్లో మా చెక్కాగాడు (మా అన్నయ్య కొడుకు, పదేళ్లుంటాయ్. పేరు చక్రధరరావు, ముద్దుకు చెక్కా అని పిలుస్తాము) పరుగెత్తుకుంటూవచ్చి "బాబాయ్. ఈవేళ మా స్కూలు పిల్లలంతా యిక్కడ మంత్రులాట ఆడుకుంటుంటే యింకా యిట్లాగే కూర్చున్నావేం. నిన్ను ప్రెశిడెంటుగా చేసాం. రావాలి త్వరగా, మంత్రులంతా వచ్చేశారు" అని నా చెయ్యిపట్టుకొని లాక్కెళ్లాడు మా ఇంటిహాల్లోకి.

చూద్దునుగదా ఆ హాలంతా ఒక అసెంబ్లీ హాలుకు మల్లే తయారుజేసారు. నాకూ ఈ శెలవైనందుకు మంచి ప్రోగ్రాం దొరికిందనుకొని సంతోషపడ్డా. ప్రెసిడెంట్కు వేసిన కుర్చీలో కూర్చున్నా. మిగతా కుఱ్ఱా (మంత్రులు)అంతా తయారయ్యారు. మా చెక్కాగాడు ప్రధాన మంత్రి.

"యింక కార్యక్రమం మొదలుపెడ్దామా బాబాయ్" అనడిగాడు చక్కా.

"అదేమిట్రా, వెధవ, బాబాయంటావు నన్ను. అధ్యక్షుడిని గాదట్రానేను, అధ్యక్షా: అను."

"క్షమించు, క్షమించు, ఊ, అధ్యక్షా. యింక మొదలెడ్దామా."

"ఊ"

ప్రధానమంత్రి ఒక మంత్రితో:

"ఏమోయి వేరుశనక్కాయల మంత్రీ! వేరుశనక్కాయలకింక కంట్రోలు పెట్టదలుచుకొన్నాం, నీ అభిప్రాయమేమిటో శెలవియ్యి."

"అయ్యా. మంచిదేగాని మన మంత్రులు చాలామందిదగ్గర వేరుశనక్కాయ చాలా నిలవుంది, ఆ సరుకంతా విడుదల చేసుకోకుండగనే కంట్రోలు పెట్టేస్తే వాళ్లు దెబ్బతింటారేమో."

"ఆదేంటి, వాళ్లు దెబ్బతింటారని ప్రజల్ని యింకెన్నాళ్లిట్లా అవస్త పెట్టడం?"

"వాస్తవమేగాని తోడిమంత్రులు దెబ్బతిన్న తర్వాత మన మంత్రిత్వాలెందుకు, మీ ప్రధానత్వమెందుకు, వాళ్ళు దెబ్బతింటే మనకి మాత్రం దెబ్బగాదూ. వాళ్ళ సుఖమే మన సుఖం, తద్వారా, ప్రజల సుఖమూను."

"యిహ చాలు మనలో యిటువంటి స్వార్థాలోచనలుంటే ప్రజలకు సుఖాన్ని దూరంజేసిన వాళ్ళమవుతాం, హెచ్చరిక."

మిగతా మంత్రులు: "నీ వెవరయ్యా మమ్మల్నాక్షేపించడానికి. బెదరించడానికివ్వీ—"

(మంత్రులు—ఒకరితో ఒకరు గుసగుసలు) మంత్రులంతా ప్రధానితో: "రేపీపాటికి నీ రిజల్యూషన్ విత్‌డ్రా) జేసుకోకపోతే నీ మీద 'నో కాన్ఫిడెన్సు' మోషన్ తీసుకొస్తాం జాగ్రత్త."

శృతిమించి రాగాన్ని పడింది, నేను, (అంటే ప్రెసిడెంటు) కలుగజేసుకోక తప్పిందిగాదు.

సరే వేరుశనక్కాయ నిలవజేసుకొన్న మంత్రులంతా చెయ్యెత్తండన్నా, ఎనమండుగురెత్తారు పదిమంది మంత్రులికీ.

"మీరంతా వచ్చేనెలలోపుగా మీమీ సరకుల్ని విడుదల చేసేసుకోండి."

వేరుశనక్కాయమంత్రితో: ఈ లోపుగా ప్రజల కన్నీరు తుడవ్వచ్చు. నీవు క్రింది అధికార్లందరి దగ్గరనుంచి వాళ్ళ వాళ్ళ జిల్లాలలో రెండేసి గింజల వేరుశనక్కాయ లెన్నున్నాయో, మూడేసి గింజల వెన్నున్నాయో సమాచారం తెప్పించు" అన్నా. అంతటితో మంత్రులంతా రాజీఅయ్యారనే చెప్పొచ్చు.

కూరగాయలమంత్రి: "చూడండీ, నిన్నను నా పోర్ట్‌ఫోలియో ఈ మాంసంమంత్రిగాడు తీసుకొని, యివ్వనంటున్నాడు."

"ప్రధాని : (మాంసంమంత్రితో) ఏమిటయ్యా, ఈ గొడవంతాను? అతని పోర్ట్‌ఫోలియో నిన్నెవడు లాక్కోమన్నాడు ?

మాంసంమంత్రి: "చూడండీ మరి, మొన్న మార్కెట్టులో 6 పీసెల బీరకాయల్ని మనెవర్కీ తెలియకుండా అమ్మేశాడు ఈ కూరగాయల మంత్రి. అమ్మినవాడు మన వాటాసంగతేమీ చెప్పకుండగానే ఎగేశాడు—అంచేతనే లాక్కున్నా."

ప్రధాని: "యిష్, నెమ్మదిగా మాట్లాడవయ్యా, యిక్కడ ప్రెస్ రిపోర్టర్లుంటారు."

మాంసంమంత్రి : "అ, ఎవరికి తెలియని బాగోతమయ్యా యిది."

కూరగాయలమంత్రి : "నేనమ్మిన మాట నిజమే. కాని వచ్చే బడ్జెట్‌లో అందరి మంత్రులకి సరిపెడ్తా నన్నానుగా."

ప్రధాని: "సరే నీ మాట నమ్మి నీది నీకిప్పించేస్తున్నా" మాంసంమంత్రితో "యిచ్చేసేయ్, వాడిది వాడికి" "రూపాయల మంత్రేడీ, ఎక్కడా కన్పించడేం?" అనడిగా నేను.

ప్రధాని: "టూరెల్లాడు."

నేను: "ఎప్పుడొస్తాడు?"

ప్రధాని: "బహుశా స్వగ్రామానికి టూరు వేసుకు వెళ్ళివుంటాడు, పొలాలు బాగుచేయించుకుంటున్నాడేమో, కోతలయిపోయాయి గదా, నిమ్మదిగా పంటంగట్రా ఎసూళ్ళు జేసుకొని వస్తాడు."

రిక్షాబళ్ళమంత్రి: "ఆడేనేంటి అంత టూరెళ్ళేది, మేముమాత్రం వెళ్ళలేం, మాకూ బోలెడు పనులున్నాయి. మాకూ జీతాలు చాలడంలేదు, ఈ విధంగానైనా ఏదో ఎలవన్సు డబ్బులు ముడ్తాయి, రేపే కాకినాడెళ్తా."

మాంసంమంత్రి:"మరి నేను రాజమండ్రెళ్తా."

కూరగాయలమంత్రి: "మరి నే ననకాపిల్లెళ్తా. అక్కడ మా అప్ప సవర్తాడిందిగూడాను."

మిరపగాయల మంత్రి: "నాను బెజవాడెళ్తా. సర్కసొచ్చిందంటక్కడిక్క, భూసొచ్చినట్టు కూడా వుంటుంది.

చింతపండు మంత్రి: "రొంబ సంతోషం. నాన్ చిదంబరందా పోదును. అక్కడి దా నటరాజుత్సవం రొంబగుడ్."

ఇంతట్లో మా ఆవిడొచ్చింది హాల్లోకి.

"ఏమిట్రా ఈ రసాభాసంతాను" అనుకుంటూను. "మంత్రులాటే" అనన్నా—"చాల్లెద్దురూ, మీకూ మతి పోయిందనుకుంటా." "ఏమిట్రా వెధవ మంత్రులాటా మీరునూ ప్రొద్దున్నే పాచికొంపలో" అంటూ కుర్రాళ్ళని తరిమేసింది.

FREE MEDICINE FOR

**ASTHMA**

*Most efficacious remedy for Asthma given free. Apply,*

CHUNILAL SHAH & Co., 24, Church Gate Street,
Fort, Bombay 1.